# కార్మిక నైపుణ్యానికి

# అంజని సిమెంట్ సాన



పీఎస్ రాజు

హైదరాబాద్: అంజనీ సిమెంట్స్ ఫ్యాప్సీ తొలిసారిగా ప్రవేశపెట్టిన సీఎస్ఆర్ అవార్డును చేజిక్కించుకొని సంచలనం సృష్టించింది. సామాజిక బాధ్యతలో కంపెనీల పాత్రను మరోమారు తెరపైకి తెచ్చింది. రాష్ట్ర సిమెంట్ పరిశ్రమ పితామహుడు, దివంగత రాశి సిమెంట్స్ అధినేత బీవీ రాజు తమ సామాజిక సేవకు స్ఫూర్తి అని అంజనీ సిమెంట్స్ గ్రూప్ జనరల్ మేనేజర్ పీఎస్ రాజు అంటున్నారు. ఈ సేవా తత్వాన్ని కంపెనీ చైర్మన్ విష్ణురాజు వారసత్వంగా పుణికిపుచ్చుకున్నారనడానికి ఫ్యాప్సీ అవార్డే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

## సామాజిక సేవలో భిన్న కోణాలు..

ఏదైనా కంపెనీ తన సొంత ఉద్యోగుల పిల్లల కోసం కాలనీల్లో పాఠశాలను నడపటం పరిపాటి. కానీ.. అంజనీ సిమెంట్స్ మాత్రం నాలుగు గ్రామాలకు అందుబాటులో ఉండేలా కాలనీకి వెలుపల సీతా మెమోరియల్ స్కూల్‌ను కోటి రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రకటించిన మరుక్షణమే కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించింది. పల్లెల్లో వృద్ధులను గుర్తించి నెలవారీ పింఛన్లు అందించడం, కరువు, కాటకాలు వచ్చినప్పుడు ఉచితంగా బియ్యం, దుస్తులు సరఫరా చేయడం, పేద విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలవడం.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో కార్యక్రమాలు..

## విద్యతోనే అభివృద్ధి...

నల్గొండ జిల్లాలోని సిమెంట్ క్లస్టర్‌లో కంపెనీ నెలకొనివుంది. ఈ ప్రాంతంలో ఎన్నో సిమెంటు ఫ్యాక్టరీలున్నా నైపుణ్యవంతమైన కార్మికుల కొరత ఎక్కువగా ఉంది. ఈ అంశాన్ని గుర్తించిన అంజనీ సిమెంట్స్ దేశంలోనే తొలిసారిగా సిమెంట్ పరిశ్రమలో కీలకపాత్ర పోషించేలా బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిమెంట్ టెక్నాలజీని నెలకొల్పింది. ఈ సంస్థ నిరుద్యోగులను ఎంపిక చేసి వారికి ఏడాది పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి నైపుణ్యవంతమైన కార్మికులుగా వారిని తీర్చిదిద్దుతుంది. కంపెనీలో ఉద్యోగాలు ఇవ్వడమే గాకుండా ఇతర కంపెనీలూ వచ్చి వీరిని రిక్రూట్ చేసుకోవడానికి ప్లేస్‌మెంట్స్ కూడా నిర్వహిస్తుంది. ఈ ఇన్‌స్టిట్యూట్‌ను సిమెంట్ పరిశ్రమలోనే విశిష్టమైన సంస్థగా రూపొందించాలనేది తమ ధ్యేయమని పీఎస్ రాజు అంటున్నారు. ఈ ఏడాది 30 మందికి శిక్షణ ఇస్తామని, కాలక్రమంలో పరిశ్రమలో ఉద్యోగం చేసే వారి నైపుణ్యం పెంచడానికి ప్రత్యేక కోర్సులు ప్రవేశపెడతామని అన్నారు. రెండేళ్లు, మూడేళ్ల కాలపరిమితి కలిగిన ప్రొఫెషనల్ కోర్సులను ప్రవేశపెట్టి ఈ ఇన్‌స్టిట్యూట్‌ను డీమ్డ్ యూనివర్సిటీగా తీర్చిదిద్దాలన్న ఆలోచన ఉందని ఆయన తెలిపారు.

